# గొంగడి

ఇక్కడంతా వొకేలాగ
వొక చితి రాత్రి లాగ

తడుస్తున్నది ఎండి
వాన రాత్రుల గుంపు

బురద కన్నీటి బురద
జారిపోతున్నది దుఃఖం మీద
తంగేడు మొగ్గ

ఇక్కడంతా కాలిన కండల పొగ
కరిగిన కనుపాయల కొండలు
నిశ్శబ్దం... బోలు నిశ్శబ్దం
చదలెక్కిన గడపలు

నాయ్‌నలూ కనుసన్నలూ
గుమిగూడకండి ఛిద్రమవుతుంది గుండె
సారె తిప్పకండి అంటుకుంటుంది మన్ను
జోడించకండి కలల్ని

పలిగిన పానాది రాళ్లు
గునుగు పూలా భూమి
నలనల్లని గోసల
నునుపు తేలినా భూమి
ఇక్కడంతా మంటల చెరువైన కడుపు

పాతాల గరిగెల మొనలను
కరుచుకున్న తాబేలు కండ్లు
ఇక్కడంతా అదొకలాగ
కొనదేలిన ప్రేమలు

నాయనమ్మా...
నీ మట్టెలు మీటిన కంపలు బావులు
గుండ్రంగా చెమ్మగిల్లుతున్నాయి
నీకు రైక లేదని తెలుసు
చీర కొంగూ లేదని తెలుసు
ఇక్కడిక నాలోంచి దూకిన
ఓ పురా పురుష దేహం కాలి రజనెక్కి
చింతల కనుమల్లోకి నడిచిందనీ తెలుసు

సిద్ధార్థ
('బొమ్మలబాయి' – 03.07.1998)